క్లుప్తంగా

ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాల పరిశీలన



ఎస్జీఎస్ కళాశాల వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో కొనసాగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను శుక్రవారం పట్టణ సీఐ అడపా నాగమురళి, ఎస్ఐ బీవీ.రామారావు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్జీఎస్) కళాశాల, వాగ్దేవి మహిళా కళాశాల, అమ్మాజీ కళాశాల, జీఆర్సీ కళాలల్లో పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాట్లను తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాసే సమయంలో పరీక్ష కేంద్రాల్లోకి ఎవరినీ అనుమతించవద్దని, విధుల్లో ఉన్న వారిని మినహా ఇతర ఉద్యోగులను, విద్యార్థుల తల్లిదండ్రులను అనుమతించవద్దని సిబ్బందికి సూచించారు.

పౌష్టికాహారం అందించాలి

వీరులపాడు: అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య పేర్కొన్నారు. మండలంలోని బోడవాడ, జమ్ము వరం, గోకరాజుపల్లి గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం సందర్శించి కేంద్రాల అందుతున్న పౌష్టికాహారం, కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులు విధిగా పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఆమె సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, కోడిగుడ్లు అందజేశారు.

వక్ఫ్ బోర్డు కార్యదర్శికి సన్మానం



జుబేర్ను సన్మానిస్తున్న గోల్డ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శిగా పట్టణానికి చెందిన షేక్ జుబేర్ నియమితులైన సందర్భంగా శుక్రవారం స్థానిక గోల్డ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక బంగారు కొట్ల సెంటర్లో జరిగిన కార్యక్రమంలో గోల్డ్ వర్కర్స్ యూనియన్ హండ్రెడ్ కమిటీ చైర్మన్ షేక్ బాజీ, వైస్ ప్రెసిడెంట్ అఫ్జల్, సెక్రటరీ అబ్దుల్లా, కార్యవర్గ సభ్యులు షేక్ ఖాజా, పఠాన్ వజీర్, రఫీ, అజీఫ్, వలీ, బాషా, నాగుల్, అన్వర్, కరీం, బొబ్బిలి, నారాయణ, దుస్సా శ్రీను ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే ఉదయభానుకు, అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వేరాళ్ల ఏర్పాటు పనులు

కంచికచర్ల: భూముల రీ సర్వేతో ఖచ్చితమైన కొలుతలు, హద్దులతో సర్వే హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. మండలంలోని పరిటాలలో శుక్రవారం రీ సర్వే చేసిన భూముల్లో హద్దురాళ్లను పాతారు. ఈ మేరకు తహసీల్దార్ మాట్లాడుతూ ఈ నెలాఖరు కల్లా సర్వే రాళ్ల పాతేలా తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టే సమయంలో రైతులు పట్టాదార్ పాసుపుస్తకాలు తీసుకువచ్చి తమ సిబ్బందికి సహకరించాలన్నారు. డెప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రాజేంద్ర ప్రసాద్, డీటీ నాగుల్మీరా, ఆర్ఐ శిరీష, సర్వేయర్ బసవరావు, వీఆర్వోలు శ్రీలక్ష్మి, వేముల ప్రదక్షిణరావు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

జగ్గయ్యపేట అర్బన్: కుక్కలు వెంట పడటంతో బైక్పై నుంచి పడి ఓ వ్యక్తి గాయపడ్డాడు. శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి..స్థానిక బుద్ధ విహార్ సమీపంలో ఎల్ఐసీ ఫీల్డ్ ఆఫీసర్ ధర్మా బైక్పై వెళుతుండగా, సమీపంలోని కుక్కలు వెంటపడ్డాయి. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయాడు. విజయవాడ ఆస్పత్రికి తరలించారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భర్త వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహంతిపురానికి చెందిన ఎనికెపల్లి సునీత, రమేష్ భార్యభర్తలు. వీరికి 18 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి బాబు. హోల్సేల్ కూరగాయల షాపులో పని చేసే రమేష్ కొంత కాలంగా భార్యను వేధిస్తున్నాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అకాల వర్షం..రైతుల్లో కలవరం

- పంట కాపాడుకునేందుకు పరుగులు
- రైతుల్లో తీరని వేదన
- పంట నష్టపోతామంటున్న రైతులు



పెనుగంచిప్రోలులో మిర్చి రాశులపై కప్పిన పట్టాలు

పెనుగంచిప్రోలు: మండలంలో శుక్రవారం ఉదయం కురిసిన భారీ వర్షంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. కల్లాల్లో ఉన్న మిర్చి పంటను కాపాడుకునేందుకు పొలాలకు పరుగులు తీశారు. పరదా పట్టాలను కప్పి పంటను కాపాడుకునేందుకు పాట్లు పడ్డారు. ఉరుములు మెరుపులతో ప్రజలు భయాందోళనలు చెందారు. రాన్ను మూడు రోజులు వర్షాలు ఉంటాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలు రైతులకు తీరని వేదనను మిగిలిస్తున్నాయి. మిర్చికి తోడు మొక్కజొన్న కోతలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ సమయంలో వర్షం నష్టం కలిగిస్తుందని రైతులు అంటున్నారు.

తడిసిన మిర్చి..

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల పాటు కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది, కొన్నిచోట్ల మిర్చిపంట తడిసింది. మండలంలోని షేర్మహ్మద్పేట, అనుమంచిపల్లి, గండ్రాయి, తిరుమలగిరి, తక్కెళ్లపాడు, చిల్లకల్లు గ్రామాలలో కొద్ది రోజుల్లో చేతికొచ్చే మొక్కజొన్న ఈదురుగాలులతో కూడిన వర్షానికి నేలకొరిగింది. కల్లాల్లోని మిర్చి కూడా స్వల్పంగా తడిసింది. వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు పంట నష్ట అంచనాలు తయారు చేస్తున్నారు.

నేలవాలిన మొక్కజొన్న



నేలవాలిన మొక్కజొన్న

వత్సవాయి: అకాలవర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఏడాది పత్తి పంట అరకొరగా దిగుబడులు రావడంతో ఎక్కువ శాతం మంది రైతులు పత్తి పంటకు బదులుగా మొక్కజొన్న పంటను నాటారు. మిర్చి పంటకు కూడా వైరస్ను సోకడంతో మిర్చి రైతులు కూడా పంటను తొలగించి మొక్కజొన్న తోపాటు పెసర, మినుము పంటలను కొద్దిగా సాగుచేశారు. మొక్కజొన్న, పెసర పంటలు చేతికివచ్చే సమయంలో పడిన అకాలవర్షానికి పంట తీవ్రంగా దెబ్బతిన్నది. మొక్కజొన్న ఇప్పుడే కండెలు వేసే సమయంలో గాలులతోకూడిన వర్షం పడడంతో పంట నేలవాలింది. మండలంలో 3600 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తుండగా 1800 ఎకరాల్లో పంట నేలవాలిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పెట్టుబడులు పూర్తయిన తరువాత పడిన వర్షం వల్ల రైతులు నష్టపోయే పరిస్థితి వచ్చింది. కల్లాల్లో పోసిన మిర్చి కూడా చాలాచోట్ల తడిసిపోయింది.

వైభవంగా జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే జగన్మోహనరావు



నరసింహారావుపాలెంలో జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

నరసింహారావుపాలెం(వీరులపాడు): మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో కోదండ రామచంద్ర స్వామి వారి ఆలయ జీర్ణోద్ధరణ, జీవధ్వజ స్తంభ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పరాంకుశం వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ధ్వజ స్తంభ ప్రతిష్ట నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా అర్చకులు స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. మండలంలో పరిసర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. గ్రామంలోని అగస్త్య పీఠాధిపతి సుగుణానంద స్వామీజీ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే జగన్మోహనరావు..

గామంలో ప్రతిష్టా మహోత్సవాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఎమ్మెల్యేకు మహోత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్మోహనరావు స్వామి వారికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మిశెట్టి దుర్గాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తిసౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బొమ్మిశెట్టి భాస్కరరావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, నాయకులు విజయ భాస్కర్రెడ్డి, శీలం రమణారెడ్డి, పచ్చాల కోటేశ్వరరావు, హుసేన్, వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్మోహనరావు

నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి

- ఎమ్మెల్యే జగన్మోహనరావు
- గుండె శస్త్ర చికిత్సకు రూ.4 లక్షలు సాయం



రూ.నాలుగు లక్షల ఎల్వోసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహనరావు

నందిగామ టౌన్: వైద్య ఖర్చుల భారం నిరుపేదలపై పడకూడదనే సదుద్దేశంతో సీఎం సహాయ నిధి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామానికి చెందిన సాయికుమార్కు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.4 లక్షల ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని శుక్రవారం రాత్రి అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహనరావు మాట్లాడుతూ తుర్లపాడు గ్రామానికి చెందిన వెంకటరత్నం కుమారుడు సాయికుమార్ గత కొంత కాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతన్నాడన్నారు. వైద్యులను సంప్రదించగా శస్త్రచికిత్స చేయాలని సూచించటంతో ఆర్థిక సహకారం అందించాలని తన వద్దకు రావటంతో ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి దృష్టికి తీసుకెళ్లటం జరిగిందన్నారు. దీంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చులకు రూ. నాలుగు లక్షల ఎల్వోసీ మంజూరైందన్నారు. విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆరోగ్య శ్రీ పథకం ద్వారా సుమారు 2,600లకు పైగా జబ్బులకు ఉచిత వైద్యం అందించటం జరుగుతుందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్రెడ్డి అడుగు జాడల్లో నడుస్తూ నిరుపేదలకు అన్ని రకాలుగా అండగా ఉంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, పెరమసాని నరసింహారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడండి

అజిత్సింగ్నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలో 'ఫ్రైడే–డ్రైడే' కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముందుగా ఉత్తర కొరియా(యూకే)నుంచి నగరానికి విచ్చేసిన బీట్రిస్ ఎజిడ్ అనే పీహెచ్డీ రీసెర్చర్ నగరంలోని పారిశుద్ధ్య విధానం తీరు, దోమల వ్యాప్తి, నియంత్రించే పద్ధతులను తెలుసుకున్నారు. రీసెర్చ్ కన్సల్టెంట్ పావని పండ్యాల ఆమెకు వీటి గురించి అర్థమయ్యేలా వివరించారు. అనంతరం ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని, మనం నివసించే ప్రదేశాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలంటూ వాంబేకాలనీ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ దోమల వ్యాప్తిపై అవగాహన కల్పించుకొని, దోమల నియంత్రణకు కృషి చేయాలంటూ ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్నాయక్, మలేరియా ఇన్స్పెక్టర్ పి.రాజ్కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్ జయపాల్, మలేరియా సూపర్వైజర్ బి.బెనర్జీ పాల్గొన్నారు.

పారిశ్రామిక వికాసానికి ఊతం

వన్టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన 2023–2024 వార్షిక బడ్జెట్ పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధికి ఊతమిచ్చేదిగా ఉందని విజయవాడ ఆటో క్లస్టర్ ఆర్థిక సంఘం డైరెక్టర్ బాయన బాబూజీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర బడ్జెట్లో పరిశ్రమలు, ఐటీ రంగాల కోసం రూ.4112.50 కోట్ల నిధులు కేటాయించటం హర్షణీయమని తెలిపారు. పారిశ్రామిక క్లస్టర్ల అభివృద్ధి, ఎంఎస్ఎంఈ పారిశ్రామిక రాయితీలు, ప్రోత్సాహకాలకు గత ఆర్థిక సంవత్సరం కంటే భారీగా నిధులను కేటాయించారని పేర్కొన్నారు.

ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్

మైలవరం: నేటి యువత ఇంటర్నెట్ మొబైల్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్కు గురవుతున్నారని హైదరాబాద్కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర సమన్వయకర్త వై.చంద్రయ్య తెలిపారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సీడీపీఓ సంయుక్త ఆధ్వర్యంలో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఎంబీఎం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బాలికల అక్రమ రవాణా, లైంగిక దోపిడీపై అవగాహన కార్యక్రమం జరిగింది. చంద్రయ్య మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇప్పటివరకు 26,500 మంది యువతులను, మహిళలను కాపాడి వారికి పునరావాసం ఏర్పాటు చేశామన్నారు. మైలవరం సీడీపీఓ పుష్పలత మాట్లాడుతూ ఏ అమ్మాయి కూడా అక్రమ రవాణాకు గురికాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శోభ, శ్రీలత, తులసీ, గౌసియా బేగం, శ్రావ్య శృతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పన్ను మినహాయింపునకు అవకాశం

కమిషనర్ జయరామ్

నందిగామ: నగర పంచాయతీ పరిధిలో పెండింగ్లో ఉన్న ఇంటి, ఖాళీ స్థలాల పన్నులు కట్టే వారికి ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పించినందున సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ డాక్టర్ జయరామ్ సూచించారు. శుక్రవారం కమిషనర్ మాట్లాడుతూ..నందిగామ నగర పంచాయతీ పరిధిలో భవనాలు, ఖాళీ స్థలాలు, ఇంటి పన్ను చెల్లించని వారికి ఇప్పటివరకు నెలకు నూటికి 2 శాతం చొప్పున అపరాధ రుసుం విధిస్తున్నామన్నారు. ఈ తరుణంలో ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 34 ద్వారా అపరాధ రుసుం లేకుండా పన్ను కట్టుకునే వెసులుబాటు కల్పించిందని తెలిపారు. ఈ అవకాశం ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే ఉందన్నారు. ఇప్పటి వరకు పన్నులు కట్టలేక పోయిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సెలవు రోజుల్లో కూడా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు నగర పంచాయతీ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని నగర పంచాయతీ ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. పన్నులు సకాలంలో చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వివరాలకు ఆయా పరిధిలోని సచివాలయాల్లో, నగర పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వెంటనే పన్నులు చెల్లించాలని ఆయన కోరారు.

రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి బ్రహ్మం, పక్కన నాయకులు

అనిగండ్లపాడు (పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు గ్రామం నుంచి గుమ్మడిదుర్రు, శివాపురం వరకు రూ.44 లక్షలతో చేపట్టే ఆర్అండ్ రోడ్డు మరమ్మతు పనులకు శుక్రవారం సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తక్షణం రోడ్డు మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయించారని, త్వరలో పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టటం జరుగుతుందని నాయకులు అన్నారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామాధ్యక్షుడు గంగూరి ప్రసాద్, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్మియా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి పెంటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు దోసపాటి దానయ్య, వూట్ల లక్ష్మయ్య, ఉన్నం శ్రీనివాసరావు, పోపూరి రామకోటేశ్వరరావు, వూట్ల లక్ష్మయ్య, పసుపులేటి రాధ, తదితరులు పాల్గొన్నారు.

తుప్పపట్టిన ఇనుప విద్యుత్ స్తంభాలు మార్చాలని వినతి



ప్రమాదకరంగా ఇనుప విద్యుత్ స్తంభం ..(ఇన్సెట్) తుప్పపట్టిన స్తంభం అడుగుభాగం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 5వ వార్డులో అడుగుభాగం తుప్పుపట్టి శిథిలమై పడిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని ఆ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ విద్యుత్శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ వార్డులో హెచ్డీలైన్ పాత ఇనుప స్తంభాలు తుప్పుపట్టిపోయి ఎప్పుడు పడిపోయేలా ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వీటిని మార్చాలని విద్యుత్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సుమారు 5 స్తంభాలు ఇదే విధంగా తుప్పుపట్టి ఉన్నాయని, విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వలన ప్రాణాపాయం జరిగితే దీనికి వారే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. దీనిపై ట్రాన్స్కో డీఈ, విజయవాడ వారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అంబేడ్కర్ పార్కు పనుల పరిశీలన



పార్కు పనులు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): కృష్ణలంక హైవే వెంటఉన్న అంబేడ్కర్ పార్కులో జరుగుతున్న పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శుక్రవారం నగర పర్యటనలో భాగంగా ఆయన పార్కును పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పార్కు పనులను అదనపు యంత్రాలు, వర్కర్లను ఏర్పాటు చేసి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ కె.వి సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.ఎస్.ఎన్ ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పారిశుద్ధ్య విధానాన్ని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం సర్కిల్–1 పరిధిలోని 56వ డివిజన్ పాతరాజరాజేశ్వరిపేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పారిశుద్ధ్య సిబ్బంది ప్రధాన రహదారులు శుభ్రం చేసిన తర్వాత అంతర్గత రోడ్లను క్లీన్ చేయాలన్నారు. సైడ్ డ్రెయిన్లలో మురుగునీటి పారుదల విధానాన్ని పర్యవేక్షించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఇంటింటి చెత్త సేకరణ నిత్యం 100 శాతం నమోదు చేయాలని, డ్రైన్లలో వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో వాటర్ పైప్లైన్ లీకేజీలు లేకుండా చూడాలని చెప్పారు. ఈ పర్యటనలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చిన్నరామాలయంలో విగ్రహాల ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్ఠించనున్న స్వామి వార్ల విగ్రహాలు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చెరువు బజారులో నూతనంగా పునర్నిర్మించిన శ్రీసీతారామ మందిరం (చిన్న రామాలయం)లో శనివారం శ్రీహనుమత్ సీతారామచంద్ర, లక్ష్మణ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. ఉదయం 10.18 గంటలకు యంత్ర ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ ప్రైవేటు ఇంప్రూవ్మెంట్ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం శ్రీ సీతారామస్వామి శాంతి కల్యాణం జరుగుతుందన్నారు.

విగ్రహాల ఊరేగింపు..

ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీహనుమత్ సీతారామ లక్ష్మణ స్వామి వార్ల ఊరేగింపు ప్రధాన వీధుల్లో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకట కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట



గౌస్మొహిద్దీన్ను అభినందిస్తున్న మత పెద్దలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేసి సీఎం వైఎస్ జగన్ మోహన్రెడ్డి తాను మైనార్టీల పక్షపాతినని మరోసారి నిరూపించుకున్నారని జిల్లా వక్ఫ్బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డులోని మస్జిదే నూరియాకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 2023–24 రాష్ట్ర బడ్జెట్లో మైనార్టీల సంక్షేమానికి రూ. 4023 కోట్లు కేటాయించిందన్నారు. గతేడాది బడ్జెట్లో రూ. 3554 కోట్లు కేటాయించిందని, ఈ ఏడాది బడ్జెట్లో రూ. 650 కోట్లు పెంచారన్నారు. మైనార్టీల, అభివృద్ధి సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ కట్టుబడి ఉన్నారని చెప్పడానికి బడ్జెట్లో కేటాయింపులే నిదర్శమన్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలు గౌస్ మొహిద్దీన్ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మసీదు సెక్రటరీ అబ్దుల్ ఆదిల్ షా సాహెబ్, మహమ్మద్ అజ్మత్ పాషా, సాహిల్ అలీ ఖాన్, ఇమ్రాన్,అబ్దుల్ కరీం,షేక్ జిలానీ,హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి నిద్ర దివ్య ఔషధం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఆరోగ్యవంతమైన జీవన విధానంలో నిద్ర కీలక పాత్ర పోషిస్తోందని సైకాలజిస్ట్ డాక్టర్ పీవీ రాధిక చెప్పారు. ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో సంపూర్ణ ఆరోగ్యం–నిద్ర అనే అంశంపై సదస్సు జరిగింది. రాధిక మాట్లాడుతూ ప్రస్తుతం నిద్రలేమితో యువత అనేక మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రపంచంలో 50 శాతం మంది సంపూర్ణ నిద్రకు దూరంగా ఉంటున్నారన్నారు. నిద్ర లేమితో శ్వాస సంబంధిత సమస్యలతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారని వివరించారు. మనిషి కనీసం రోజులో 6 నుంచి 8 గంటలు నిద్రపోతేనే ఆరోగ్యంగా ఉంటారని, సరైన జీవనశైలితో ఇది సాధ్యమవుతోందని తెలిపారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ యువత ఎక్కువ సమయాన్ని సోషల్ మీడియాలో గడుపుతున్నారని, మొబైల్ వినియోగం కూడా అవసరానికి మించి ఉపయోగిస్తూ సమయాన్ని వృథా చేస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం డాక్టర్ రాధికను కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మత్తు పదార్థాల నిర్మూలన, వాటి వినియోగం వలన కలిగే దుష్పరిణామాలపై నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో స్థానిక బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. మత్తు పదార్థాల వినియోగంతో మానసిక, ఆరోగ్య, ఆర్థిక పరంగా ఇబ్బందులకు గురవుతారని సంస్థ ఏరియా కోఆర్డినేటర్ ప్రియాంక తెలిపారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు కిడ్నీ, టీబీ, క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాల వ్యసనం నుంచి డీ–ఎడిక్షన్ చికిత్సతో బయటపడొచ్చన్నారు. వివరాలకు 94904 92020లో సంప్రదించాలన్నారు.